క్లుప్తంగా

నేడు వలంటీర్లకు అవార్డుల బహూకరణ

రెంటచింతల: మండలంలోని మల్లవరం, జెట్టిపాలెం, పశర్లపాడు, గోలి గ్రామాల్లో శనివారం వలంటీర్లకు అవార్డుల ప్రధానోత్సవ బహూకరణ కార్యక్రమం తలపెట్టినట్లు ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం తెలిపారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మల్లవరం, జెట్టిపాలెం, పశర్లపాడు, గోలి గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు పశర్లపాడు గ్రామ సచివాయం వద్ద ఉదయం గం.10.లకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న సేవామిత్ర, సేవారత్న అవార్డులు బహూకరణతో పాటు శాలువాతో సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ అవార్డుల ప్రదానోత్సవ బహూకరణ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొంటున్నట్లు వెల్లడించారు. స్థానిక మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు.

నేడు చెన్నాయిపాలెంలో ప్రజావేదిక

మాచవరం : మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో నేడు సరస్వతి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఆర్‌డీఓ అద్దెయ్య తెలిపారు. మండలంలోని చెన్నాయిపాలెం, వేమవరం, తంగెడ, ముత్యాలంపాడు, పిన్నెల్లి తదితర గ్రామాల్లో సరస్వతి సిమెంట్స్ కంపెనీకి చెందిన ఫ్యాక్టరీ నిర్మాణం కోసం పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శివశంకర్‌తోపాటు పర్యావరణ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కావున మండలంలోని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు హాజరై తమ అభిప్రాయాలను తెలియపరచాలని తెలిపారు.

బాలిక చికిత్సకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న సీఐ బాలకృష్ణ

మాచర్ల : పట్టణంలోని 29వ వార్డుకు చెందిన షేక్ మగ్రుమ్‌కుమార్తె ఐదేళ్ల బాలిక ఖాశింబి గుండె సంబంధిత వ్యాధితో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ బాలకృష్ణ రూ. 10వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబానికి అందజేశారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మగ్రుమ్ కుటుంబాన్ని పిలిపించి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న బాలికకు వైద్యం చేయించాలని, అందుకు తనవంతు సహాయంగా రూ. 10వేలు అందజేశారు.

ప్రజా సమస్యల వేదిక నగరోద్యమం



ఎస్టీ కాలనీలో నగరోద్యమం నిరన్వహిస్తున్న కౌన్సిలర్లు

పిడుగురాళ్ల: ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నగర నగరోద్యమం ఒక వేదికగా ఉంటుందని పలువురు అన్నారు. పట్టణంలోని 23వ వార్డు ఎస్టీ కానీలనీలో నగరోద్యమం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఎమైనా ఉన్నాయా అని తెలుసుకుని వాటిని పరిష్కరించడం అంతేకాకండా ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే సచివాలయ ఉద్యోగులకు తెలియజేసి వారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జూలకంటి శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈ రాఘవేంద్ర, సానిటరీ ఇన్‌స్పెక్టర్ రమాదేవి, సచివాలయ అడ్మిన్ నాగార్జున రెడ్డి, వీఆర్‌ఓ రాజకుమారి, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే కుటుంబాలకు ఆర్థిక భరోసా

గురజాల(రెంటచింతల) : ఉన్నత విద్యతోనే కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని గురజాల మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్ విద్యార్థులకు సూచించారు. మండల పరిధిలోని మిట్టగుడిపాడు గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో పదో తరగతి తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణత సాధిస్తే ఇంటర్మీడియట్ చదువును అభ్యసించవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఉన్నత విద్యనందించాలనే లక్ష్యంతో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ప్రతి పేదవిద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆకాంక్షతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో విద్యనందించే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. మంచి చదువులు చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



ప్రభుత్వం నుంచి చేకూన లబ్ధిని మహిళకు వివరిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెండవ రోజు శుక్రవారం కొనసాగించారు. పోలేరమ్మ గుడి బజారు, కొదమగుండ్ల బజారులలో గడప గడపలో ఎమ్మెల్యే పీఆర్కే పర్యటించారు. ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలో ఇప్పటి వరకు ప్రజలకు చేకూర్చిన లబ్ధిని ప్రతి కుటుంబానికి పీఆర్కే వివరించారు. పింఛన్లు ఇంటికి వచ్చి అందిస్తుండడం పట్ల అవ్వాతాతలు ఇతర పింఛన్లు పొందుతున్న వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అయ్యా గతంలో ప్రతి నెల పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసి పింఛన్లు తీసుకునే దుస్థితిని తొలగించారని వారు హర్షం వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన పనిని వలంటీర్లకు చెబితే వారే పనులు చేసి పెడుతున్నారనే చాలా మంది సంతోషం కూడా వ్యక్తం చేశారు. తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన సేవలను గుర్తుంచుకుని ఆయనకు మద్దతు తెలపాలని ఎమ్మెల్యే పీఆర్కే కోరారు. తప్పకుండా అయ్యా మీరు చల్లగా ఉండాలని ప్రజలు దీవెనలు అందించారు. గ్రామంలోని కాష్టాలగడ్డ ప్రాంతంలో పర్యటన ప్రారంభించి పోలేరమ్మ గుడి బజారు, కొదమగుండ్ల రోడ్డు ఆ తర్వాత బ్రహ్మనాయుడు మేడ బజారుల ప్రాంతాల్లో

గడప గడపకు పీఆర్కే పర్యటించి ప్రజలకు ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వివరించడంతో పాటు స్థానికులకు ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కష్టాలగడ్డలో ఇళ్లపై నుంచి పోతున్న హైటెన్షన్ విద్యుత్తు లైన్లు తొలగించి మేలు చేశారని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అలాగే కాపు కల్యాణ మండపానికి రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని కేటాయించి కల్యాణ మండపం నిర్మాణానికి కూడా నిధులు ప్రకటించడం పట్ల కాపులు సంతోషం వ్యక్తం చేశారు. దాంతో పాటు సెంటర్‌లో పోలేరమ్మ గుడి స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ. 20 లక్షలు నిధులు మంజూరు చేసి అది నిర్మాణం అయ్యే విధంగా చర్యలు తీసుకున్నందుకు పీఆర్కేకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతోందని అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధే ముఖ్యమని ప్రజలందరూ సమానమేననే భావనతో ప్రభుత్వం అందరికి సంక్షేమాన్ని అందిస్తోందన్నారు. గ్రామ సర్పంచ్ రమావతు ప్రమీలా భాయితేజానాయక్, జెడ్పీటీ సీ షేక్ షఫీ, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బొమ్మిన అల్లయ్య, చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, పాతూరి రామిరెడ్డి, ఎంపీటీసీలు బొమ్మిన సావిత్రి, అంతరగడ్డ ఏసోబు, వార్డు మెంబర్లు కోరె సత్యం, రామిశెట్టి శకుంతల, కిల్లా రాణి, పలిశెట్టి కోటేశ్వరరావు, గుండా నరసింహారావు, కిల్లా కాశీవిశ్వనాద్, చల్లా ప్రసాద్, ఆశం విజయభాస్కరరెడ్డి, జక్కా నరసింహారావు, చింతల శ్రీనివాసరావు, కొమ్ము చంద్రశేఖర్, పలిశెట్టి ఆంజనేయులు, కిల్లా చెన్నయ్య, పలిశెట్టి వెంకటేశ్వర్లు, అన్నపరెడ్డి చెన్నకేవశవులు పాల్గొన్నారు.

పేద వర్గాల సంక్షేమమే సీఎం లక్ష్యం



మేరాజ్యోతు హనుమంతునాయక్

మాచర్ల : అన్నివర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమరావతి రాజధానిలో 51వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఐదు వేల మందికి టిడ్కో గృహాలను మంజూరు చేయడం చరిత్రాత్మక విషయమని రాష్ట్ర ఎస్టీ సంఘం, వైఎస్సార్ సీపీ విభాగం అధ్యక్షుడు మేరాజ్యోతు హనుమంతునాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పల్నాడు జిల్లా, మాచర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో సామాజిక సమతుల్యాన్ని పాటిస్తూ 55వేల కుటుంబాల్లో వెలుగులు నింపుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోవడం దారుణమన్నారు. పేదలకు ఇల్లు ఇవ్వడాన్ని అడ్డగిస్తూ అన్నిరకాల విఫలం చెందిన ప్రతిపక్షాలు ఇప్పటికీ పేదలకు ఇళ్లస్థలాలు, టిడ్కో ఇళ్లు ఇవ్వడం పై దుష్ప్రాచారం చేస్తున్నా పట్టించుకోకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా అమరావతిని రాజధానిగా భావించాలని ఆకాంక్షించి సీఎం వారి కోసం రూ. వంద కోట్లు కేటాయించి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని జులై 8న ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పడం శుభపరిణామమన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



ప్రభుత్వ విప్ పీఆర్కేని ఆశీర్వదిస్తున్న పాస్టర్ ప్రవీణ్‌కుమార్

మాచర్ల: ఏసుప్రభువు బోధించిన బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించే విధంగా క్రైస్తవాన్ని చైతన్య పరుస్తూ వివిధ ప్రాంతాల్లో స్వస్థత సువార్త ఉజ్జీవం సభలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రాత్రి రాయవరం జంక్షన్‌లో జరిగిన స్వస్థత సువార్త ఉజ్జీవం ముగింపు సభకు హాజరై వేలాది మంది క్రైస్తవులనుద్దేశించి మాట్లాడారు. ఏసుప్రభువు ప్రతి ఒక్కరికీ సుఖ శాంతులతో వర్ధిల్లే విధంగా ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. తాను క్రైస్తవులను తన కుటుంబ సభ్యులుగానే భావిస్తానన్నారు. అందులో భాగంగానే నియోజక వర్గంలో వివిధ చర్చిల నిర్వహణానికి కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తు ప్రతి ఏడాది క్రైస్తవులకు సహాయ సహకారాలందిస్తున్నట్లు తెలిపారు. సభలు నిర్వహిస్తున్న పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్‌లను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఏసుప్రభువును స్తుతిస్తూ ప్రత్యేక ప్రార్థనలు వందలాది మంది పాస్టర్లు నిర్వహించి పీఆర్కేకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం పీఆర్కేను సత్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది క్రైస్తవులు భారీ సంఖ్యలో తరలివచ్చి గురువారం రాత్రి 11.30 గం''ల వరకు ముగింపు ప్రార్థన కార్యక్రమం నిర్వహించారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు



ట్రాన్స్‌ఫోర్ట్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏఓ పాపకుమారి

దాచేపల్లి : అధిక ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ డి. పాపకుమారి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పలు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం ఏఓ పాపకుమారి తనిఖీలు చేపట్టారు. విత్తనాలు అమ్మకం, నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలన చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకి రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన కేసులు నమోదు చే స్తామని ఏఓ చెప్పారు. అనంతరం దాచేపల్లిలోని పలు ట్రాన్స్‌ఫోర్టు కార్యాలయాల్లో ఏఓ తనిఖీలు చేశారు. నకిలీ విత్తనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత వ్యక్తులకు ఏఓ సూచించారు.

28న పెరియార్ సమకాలీనత సదస్సు



సదస్సు ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న పీడీఎం నాయకులు

పిడుగురాళ్ల: పెరియార్‌సమకాలీనత అంశంపై ఈ నెల 28న నరసరావుపేట ఎన్‌జీఓ హోమ్‌లో జగరనున్న సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ పీడీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందరన్భంగా పీడీఎం రాష్ట్ర నాయకులు వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కులం, మతం పేరుతో ఏళ్ల నుంచి అసమానతలకు కారణమైన మనువాద వ్యవస్థపై ఆత్మగౌరవ పోరాటం చేసి, బహుజన సమాజాన్ని కులాల పేరుతో వీడదీసి ఆత్మగౌరవం లేకుండా అవమాన పరిచిన మనువాదుల గుండెల్లో తుపాకీ తూటగా మారిన గొప్ప సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి అని కొనియాడారు. నరసరావుపేటలో జరిగే సదస్సుకు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, సీనియర్‌నాయకులు నల్లపాటి రామారావు, ఎంసీపీఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి జె. కృష్ణనాయక్, ఆర్‌టీఐ జిల్లా నాయకులు కుమార్, వీరయ్య ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామోదయం



గ్రామోదయం కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసయాదవ్, అధికారులు

మాచర్ల రూరల్: గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు మండల స్థాయి అధికారులంతా తమ ముంగిటకే వచ్చే గ్రామోదయాన్ని ప్రజలు సద్వినియోగ పర్చుకోవాలని తహసీల్దార్ జి రమేష్ కుమార్, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఎంఈఓ వేముల నాగయ్య, డా'' వెస్లిలు కోరారు. శుక్రవారం మండలంలోని లచ్చంబావి గ్రామంలో నిర్వహించిన గ్రామోదయం కార్యక్రమంలో ఇంటింటి వైద్యాన్ని పర్యవేక్షించి వారు మాట్లాడారు. అర్హతే ప్రమాణంగా సంక్షేమ పథకాలు అందించటమే కాకుండా ఇంటివద్దకే వైద్యాన్ని తీసుకొచ్చి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించి అందరి ఆరోగ్యాన్ని కాపాడుతున్న ప్రభుత్వం మనదేనన్నారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను, ఉపాధి హామీ పనులను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లీలావతి, ఆర్ఐ ఫణీంద్ర, కార్యదర్శి సత్యనారాయణలు పాల్గొన్నారు.

బట్టువారిపల్లెలో..

కారెంపూడి: మండలంలోని బట్టువారిపల్లెలో గ్రామోదయం కార్యక్రమాన్ని అధికారులు శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ జి శ్రీనివాసయాదవ్ అధికారులు గ్రామంలో ప్రతి వీధిలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి ఆనుకుని ఉన్న వాగుకు వరద వచ్చినప్పుడు దగ్గరలోని ఇళ్లలోకి నీరు వస్తోందని, వాగు పూడిక తీత పనులతో పాటు వాగునీరు పొర్లకుండా గట్టు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. కొన్ని చోట్ల వీధి లైట్లు వేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇదిలా ఉంటే గ్రామ పంచాయతీ స్థలంలో ఉన్న బోరును ప్రైవేటు వ్యక్తి వినియోగిస్తున్నాడని గుర్తించి ఇంటికి ఉన్న పైపు లైన్ కట్ చేశారు. నూతనంగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని అధికారులు పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి ఇద్దరు చిన్నారులు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను అధికారులు పరిశీలించి అక్కడ సిబ్బందికి తగిన సూచనలు చేసి ఉదయం అల్పాహారం వారితో చేశారు. గుర్తించిన సమస్యలన్నింటిని సంబంధిత శాఖల అధికారులు పరిష్కరిస్తారని తహసీల్దార్ తెలిపారు. ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, వెటన్నరీ డాక్టర్ వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ ఏరువ మరియమ్మ, మాజీ సర్పంచ్ రమేష్, వీఆర్వో పి సైదులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, వివిధ శాఖల ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జ్యోతికి ఏఎన్‌యు డాక్టరేట్ ప్రదానం



పసల జ్యోతి

పిడుగురాళ్ల: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన పసల జ్యోతికి శుక్రవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు. గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి పీజీటీ తెలుగు ఉపాధ్యాయులుగా పసల జ్యోతి విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ చింతల ప్రవీణ్ కుమార్ సాహిత్యం- సమగ్ర పరిశీలన అనే అంశంపై పరిశోధన వ్యాసాన్ని సమర్పించారు. ధరణికోట ఎంవీపీ సత్యనారాయణ ఆర్‌వీపీ కళాశాల వారి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య మాధవి, బోర్డ్ ఆఫ్ స్టడీ చైర్మన్ ఆచార్య కృష్ణారావు, ఇన్‌టర్నల్ ఎక్జీమినర్ ఆచార్య జె. అప్పారావు, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నట్లు తెలిపారు.

రెండు పాకలు దగ్ధం

చిలకలూరిపేటటౌన్: ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని రెండు గుడిసెలు పూర్తిగా దగ్ధమైన సంఘటన శుక్రవారం తెల్లవారు చోటు చేసుకుంది. పట్టణంలోని ఎన్‌టీఆర్ కాలనీ ప్రసన్నాంజనేయ స్వామి గుడి సమీపంలో పూరి గుడిసెలో మతిస్థిమితం లేని మహిళ గత కొంతకాలంగా నివసిస్తుంది. ఉక్కపోత తట్టుకోలేక ఆమె సమీపంలోని గుడిలో నిద్రించింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని సమీపంలో మరో గుడిసెకు మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు మంటలను అదుపులోకి తెచ్చారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

గురజాల : రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలైన ఘటన మండలంలోని గోట్టిముక్కల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గొట్టిముక్కల గ్రామానికి చెందిన పర్వతాలు పెద్ద కుమారుడు చవకాల అమరసాయి మణికంఠ, చవకాల మహిందర్‌లు వరుసకు సోదరుడైన అమర గగేష్‌తో కలిసి పెద్దమ్మ ఇంటికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని టాటా ఏసీ వాహనం అతివేగంగా వచ్చి నిర్లక్ష్యంగా వాహనం నడుపుతూ చవకాల మహిందర్‌ను వెనుక నుంచి వాహనం ఢీకొట్టింది. మహిదర్ రోడ్డుపై పడడంతో తలకు గాయమైంది. విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వచ్చి గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు వెళ్లగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. గుంటూరులోని వైద్యశాలలో వైద్యులు పరీక్షించి బాలుడిని ఐసీయూలో ఉంచి వైద్య సేవలు అందిస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కారణంగా అతివేగంగా వచ్చి ఢీ కొట్టడంతోనే ప్రమాదం జరిగిందని బాలుడి తల్లి పర్వతాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ గుండెపోటుతో మృతి



మృతుడు బీర్నిడి జస్వంత్‌కుమార్

దుర్గి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఎన్‌ఆర్‌ఈజీఎస్ విభాగంలో కంచరగుంట ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బీర్నిడి జస్వంత్ కుమార్ (28) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. గత మూడు సం''రాలుగా గ్రామంలో ఉపాధి హామీ పనులు, విధులు నిర్వహిస్తూ అందరితో మంచి ఉద్యోగిగా మన్ననలు పొందాడు చికిత్స నిమిత్తం 108 ద్వారా మాచర్ల ఆసుపత్రికి తీసుకొని వచ్చారు. అప్పటికీ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను, బంధువులను ఓదార్చారు. అనంతరం భౌతిక కాయానికి పూలదండ వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చులు నిమిత్తం మృతుని తల్లికి స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మాదాసు వెంకటేశ్వర్లు రూ. 50వేలు అందజేశారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి

గురజాల : విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారిణి ఎం సంధ్యారాణి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పురుగు మందుల దుకాణాలు, పెస్టిసైడ్ దుకాణాలును శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులను డీలర్లు విత్తనాల కొనుగోళ్లలో ఇబ్బందులు కలిగిస్తే వెంటనే రైతులు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విత్తన డీలర్లు షాపులో అమ్మకానికి తెచ్చిన విత్తనాలకు సర్టిఫికేట్లు, లేకుండా ఉంటే అటువంటి విత్తనాలను అమ్మకం కాకుండా నిలుపుదల చేసి డీలర్లుపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు వాటి ధరలను ప్రతి దుకాణంలో బోర్డుపై ఉంచాలన్నారు. రైతులు దుకాణంలో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేస్తే విధిగా బిల్లులు అందించాలని బిల్లులపై దుకాణం యజమాని , రైతు సంతకం ఉండాలన్నారు. రైతులు పంట ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు బిల్లులు భద్రంగా ఉంచుకోవాలని రైతులకు సూచించారు. దుకాణాల్లో రికార్డులను, విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. అదేవిధంగా ట్రాన్సుపోర్టు నందు ఉన్న విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణితో పాటుసిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

వినుకొండ టౌన్: మైనర్లు వాహనాలను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారకులౌవుతున్నారని, అటువంటి వారికి వాహనాలు ఇచ్చి ప్రోత్స హించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పట్టణ సీఐ సాంబశివరావు హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా పట్టణంలో వాహనాలు నడుపుతున్న దాదాపు 100 మంది మైనర్లను శుక్రవారం నిర్వహించిన డ్రైవ్‌లో గుర్తించడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్క వాహన యజమాని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని విద్యుత్తు శాఖ మండల ఏఈ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినుకొండ రోడ్డులోని 132 కేవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. లోఓల్టేజి వల్ల తలెత్తే సమస్యలను నష్టాలను అధిగమించడానికి సాంకేతికంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఏఈ తెలిపారు.

పులిపాడు గ్రామంలో చోరీ

గురజాల : ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి బంగారు నగలు, డబ్బులు చోరీకి గురైన ఘటన పులిపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని పులిపాడు గ్రామానికి చెందిన మైలపల్లి సోమయ్య మిరపకాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు భార్య శివలక్ష్మమ్మతో కలిసి 21వ తేదీన బెంగుళూరులో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లారు. 24వ తేదీన కోల్డు స్టోరేజ్‌లో పని చేస్తున్న తమ గుమాస్తా బొజ్జా వెంకటేశ్వర్లు పులిపాడు గ్రామంలో ఇంటి వద్దకు వెళ్లి మొక్కలకు నీరు పోయమని చెప్పగా అతను ఆ సమయంలో ఇంట్లో బయట ఉన్న ఇనుప గ్రిల్ తాళాలు పగులగొట్టినట్లు గమనించి యజమానికి సమాచారం ఇచ్చాడు. దీంతో హుటాహుటిన ఇంటికి వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని ఇంట్లో ఉన్న కిలో వెండి ముద్ద, రెండు బంగారు ఉంగరాలు, 5 జతల బంగారు చెవి దిద్దులు, లక్ష నగదును చోరీకి గురైన్నట్లు గుర్తించారు. వీటి విలువ మొత్తం రూ.2,35,000/-లు విలువ ఉంటుందని అంచనా వేశారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ అనంత కృష్ణ పరిశీలించి కేసు నమోదు చేశారు.

దోబీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కంభంపాటి



కంభంపాటి రాము

పిడుగురాళ్ల: జాతీయ దోబీ రిజర్వేషన్(ఎస్సీ) సంఘ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్టణానికి చెందిన కంభంపాటి రాముని నిమిస్తున్నట్లు జాతీయ దోబీ రిజర్వేషన్ సంఘం జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కంభంపాటి మాట్లాడుతూ తన మీద నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను శక్తివంతంగా కృషి చేసి అభివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు.

రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం రెంటాల, మంచికల్లు, పాలువాయి గేటు రైతు భరోసా కేంద్రాల్లో ఆయన రైతులతో మాట్లాడారు. ఈ పచ్చిరొట్టె విత్తనాల్లో భాగంగా జీలుగలతో తమ వ్యవసాయ భూములను సారవంతం చేసుకోవాలని ఆయన కోరారు. పచ్చిరొట్టె పంటను భూమిలో కలియదున్నిన సాగుభూమి వివిధ పోషకాలతో సమతూల్యత కలిగి ఉండి మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. జీలుగలు కేజీ రూ.39.50 అందజేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు వారి పట్టాదారు పాస్‌పుస్తకం , ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఆయా గ్రామాల్లోని గ్రామ సేవకులను, రెంటచింతల వ్యవసాయ కార్యాలయంలో కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఆయన వెంట ఎంఏఓలు గొట్టం లక్ష్మారెడ్డి, వెంకటేష్ , గొంటు కృష్ణారెడ్డి తదితరులున్నారు.

నేటి నుంచి ఆకురాజుపల్లిల్లో భూ సర్వే

పిడుగురాళ్ల: జగనన్న శాశ్వతి భూ హక్కు, భూ రక్ష కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి మండలంలోని ఆకురాజుపల్లి శివారులో భూములకు సంబంధించిన కార్యక్రమం సమవర్ధవంతంగా నిర్వహించాలని ఆర్‌డీఓ ఆద్దెయ్య తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక అధికారులతో అవగాహన కారక్రమాన్ని నిర్వహించారు.